కథ

# భా(త)సంస్కరణ

వాసిరెడ్డి మోహనరావ్

అనగా అనగా ఒకానొకకాలంలో ఒకరాజ్యం వుండేది. ఆ రాజ్యాన్ని ఒకానొక రాజుగారు పరిపాలిస్తుండేవారు. రాజుగారి పరిపాలన ఒట్టి మంత్రుల మంత్రాంగంతోనే కాకుండా సైనికాధిపతుల కత్తుల పదునుతోకూడా నడుస్తూండేది.

కొన్ని సంవత్సరాలుగా దేశంలో కరువు ఏర్పడ్డంచేతనూ, రాజుని పడగొట్టి సింహాసనం అధిష్టించాలని రాజకుటుంబంలోవారే కొందరు ప్రయత్నించటంవల్లనూ, రాజుగారు విలాసాల్లో తేలి ప్రజలగురించి, పరిపాలనగురించి ఏమీ పట్టించుకోకపోవటం చాతనూ, దేశంలో దరిద్రిం ఏర్పడి అందుమూలంగా అరాజకం యేర్పడింది. ప్రిజలు ఒకచోటనుండి మరొకచోటికి వలసపోయేరు. దారిదొంగలు విపరీతంగా పెరిగిపోయేరు. ప్రిజలు ఆకలితో చచ్చిపోయేరు. చావనివాళ్ళు కొందరు చావుకోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు. మరికొందరు మాత్రం చావు ఎలాగూ వస్తుంది కనుక తిరుగబడి చనిపోవటంమేలని తిరుగబడ్డారు. అక్కడో శిస్తులువసూలుచేసే కరణాన్నీ ఇక్కడో 'శాంతిభద్రతలు' కాపాడే పటేలునీ, అక్కడెక్కడో ఒకపర్దారునీ, ఇంకెక్కడో యినప్పెట్టెనిండా డబ్బూ గాదెనిండా ధాన్యమూ నిలవచేసిన వణిక్ప్రముఖుణ్ణీ తిరుగబడ్డ జనం చంపినట్లు రాజధానికి వార్తలొచ్చేయి.

పల్లెటూళ్ళలోవుండే కామందులూ, రాబందులూ, షావుకార్లు, ధనికరైతులు, యింకా కరువుదెబ్బ తగలనివాళ్లు యావన్మందీ చావంటే భయంలేక తిరుగబడిన ప్రజల వలన కలిగిన చావుభయంతో నగరాలకు వలసవచ్చేరు.

దేశంలో అరాజకం ఏర్పడి, యెందరో చావంటే భయపడేవాళ్ళూ, కొందరు చావంటే భయపడనివాళ్ళూ చచ్చింతరువాత రాజుగారు కళ్ళుతెరచి మంత్రిగారిని యిలా అడిగేరు "అమాత్యశేఖరా! ఈ తిరుగుబాటువార్తలు యదార్థమేనా? మాకు చాలా ఆందోళన కలిగించుచున్నవి. నిజంగా ప్రిజలకు పండ్లూ పాయసాలు కాకపోయినా, ఓరొట్టెముక్కైనా దొరకటంలేదా?" ప్రక్కనే కూర్చున్న ముద్దులతనయ యువరాణి వారితలను నిమురుతూ, ఆ యువరాణి "రొట్టెలేకున్నచో కేక్ ఏల తినరాదు?"అని ప్రశ్నించలేదు. ఆమె పెంపుడుపక్షితోక ఈకలు అతిశ్రిద్ధగా గమనిస్తూ వుండిపోయింది. రాజుగారి కొడుకు యువరాజా వారు ఏదో పటాన్ని పరిశీలిస్తూ మరోవేపున ఆశీనులై వున్నారు.

893

యువరాజు చాలాదూర దేశంపోయి రథాలమీదా, యింకా యితర వాహనాలమీదా ఎంతో తర్ఫీదుపొంది మరెంతో నేర్చుకుని ఈమధ్యనే తిరిగివచ్చేరు. ఒకానొక కొత్తరకంరథం యొక్క నమూనాని తయారుచేసి, రాజుగారి అనుమతితో, ప్రజలడబ్బుతో రథాలు తయారుచేసే కార్ఖానాను నెలకొల్పి దేశంలో వణిక్ప్రముఖులూ, పండితులూ ముఖ్యంగా యువవణిక్ప్రముఖులూ, యువపండితులూ, యువరాజ వంశీకులూ రథాల కొరతవల్ల పడుతున్న బాధనుతీర్చ సంకల్పించారు. ఆదేవిషయమై తీవ్రంగా ఆలోచిస్తూవుండటంవల్లి యువరాజావారు మహారాజావారు మహామంత్రిగారిని అడిగినప్రశ్న వినలేదు.

రాజవంశంలో కుట్రలూ కుహకాలూ లేకపోతే, ఇప్పుడేమీ రాజకీయాల్ని గురించి పట్టించుకొనకపోయిననూ యువరాజే భవిష్యత్తులో ఆ దేశానికి రాజుఅవుతాడని కొందరికి తెలుసు.

రాజుగారు అడిగినప్రశ్నకు అమాత్యులవారు "నిజమే ప్రభూ! ఈవార్తలు మీకు విన్నవించి ఆందోళన కలిగించుట నాకిష్టములేకపోయినది. తిరుగబడిన ప్రజలవివరాలు సేకరించటానికి చారుల్ని రాజ్యంలో నలుమూలలకీ, పేటపేటకీ, వీధివీధికీ పంపేను. తిరుగబడ్డ ప్రజలను నరికి పారెయ్యడానికీ, తిరుగబడని ప్రముఖులను రక్షించడానికి యాభైపటాలాల సైన్యము పంపితిని. దుండగులు కనిపిస్తే నరికెయ్యమన్నాను. కనిపించకపోతే పేదవాళ్ళపేటలు, గుడిసెలు కాల్చెయ్యమన్నాను, విజయవార్తలు యింకొద్దినాళ్ళలో రావచ్చునని తెలుస్తోంది" అన్నారు.

రాజుగారు మంత్రిగారి సామర్థ్యమునకూ తెలివితేటలకూ ఎంతయున్ సంతసించి నిశ్చింతంగా నుండిరి.

* * *

నెల గడిచింది. రెండు నెలలుగడిచినవి, మూడునెలలు దాటిపోయేయి. రాజుగారికీ, అమాత్య శేఖరుడికీ. యింకా యితర రాజ వర్గానికి ఆందోళన పట్టుకుంది. వున్నకుండీ ఆందోళన భయంగా మారింది.

సైన్యమూ, చారులూకూడా దేశంలో నలుమూలలకీ వెళ్ళి తిరుగుబాటు దార్లని కొందరిని క్రూరంగా వధించేరు కాని తిరుగుబాటు తిరోగమించలేదు, అదింకా రాజుతూనేవున్నది.

రాజుగారికి ఏమిచేయాలో పాలుపోయిందికాదు. సైన్యాన్ని పంపి, వాళ్ళకు కావలసినన్ని అధికారాలిచ్చి చేయగల్గింది చేసేరు. కాని తిరుగుబాటుమాత్రం యింకా రగులుతూనేవుంది. రాజ్యంలో ధనవంతులకి రక్షణలేకపోయింది. వాణిజ్యవేత్తలూ, రాజవంశ ప్రముఖులూ, ధనికులూ, భూస్వాములూ రాజుగారిదగ్గరకొచ్చి మొరపెట్టు

894

కున్నారు. వాళ్లు గోడుగోడునఏడుస్తూ యిలా విన్నవించుకున్నారు. "ఘనతవహించిన మహాప్రభో! మమ్మల్ని రక్షించు! మా ప్రాణాల్ని, మా డబ్బుని, మా పిల్లల్ని, మా పెళ్లాల్ని రక్షించు! రక్షించు! ఎట్లా అణుస్తావో, కత్తితో అణుస్తావో, కలంతో అణుస్తావో, మరి ఏదైనా మాయామంత్రించేసి అణుస్తావో కాని యీ తిరుగుబాటును అణిచెయ్యి! లేకుంటే మాకేకాకుండా భగవంతుని స్వరూపమైన మీకూ, మీ అధికారానికీకూడా ఆఖరుదినాలు వచ్చినట్లేలెక్క".

రాజాగారు వారందరి మొరనీ ఆలకించి "మేము ఆలోచించి తగుచర్యలు తీసుకొందుము. మీకు తప్పక రక్షణ కల్గించుదుము" అని అభయమిచ్చి వారిని సాగనంపిరి.

• • •

ఆరోజు రాత్రి రాజుగారి రహస్య మందిరంలో రాజా, రాజు తమ్ముడు, రాజు బావమరిది, సైన్యాధ్యక్షుడూ, మంత్రులు, సామంతులూ, కోటీశ్వరులూ సమావేశమయ్యేరు. అందరూకూడా ఏమీ దిక్కుతోచక రాజుగారు ఏమిచెప్తారో విందామని కుతూహలంగా, దీనంగా, విచారంగా కూర్చునేరు.

రాజుగారు అంతఃపురకుట్రల్నీ, తనను పదవీభ్రష్టుడ్ని చేయాలని కోటలోనూ, వెలుపలా జరిగే కూహకాల్నిగురించి ఆపూటకి ఆలోచించటం మానేసేరు. రాజవంశ ప్రముఖులూ, కోటీశ్వరులూ అంతాకూడా ముందు సింహాసనం క్షేమంగావుంటే తామూ క్షేమంగా వుంటామనీ, ఆ సింహాసనంమీదా తామైనా, మరొకరైనా తమవర్గంవాడే వున్నంతకాలం తమకి ముప్పులేదనీ, అసలుముప్పు తిరుగబడ్డ ప్రజలనుంచనీ తెలుసుకున్నవారై, తమ సంపూర్ణ సహాయాన్ని రాజుగారికి తిరుగుబాటును అణచేందుకు (మాటప్రమే)ఇచ్చేరు.

రాజుగారు ఈరోజుతో ఈ తిరుగుబాటు సమస్యను అటో యిటో తేల్చెపారెయ్యాలనుకున్నవారై యిటనిరి "అమాత్యశేఖరా! ఇంతకుముందు మా తండ్రిగారికాలంలోను భయంకరమైన క్షామం వచ్చి ప్రజలు చనిపోయారు. కాస్తో కూస్తో అల్లర్లు, తిరుగుబాట్లు జరిగినై. కాని యిప్పటివలె అవి ఎక్కువకాలం నిలువలేదు. దీనికికారణం ఏమై యుండనోపు? సెలవియ్యండి" సమస్య నివృత్తిచేసుకొనదలచినవారై అడిగిరి.

మహామంత్రిలవారు అర్ధనిమీలిత నేత్రుడై అరక్షణంసేపు ఆలోచించి ఇట్లనిరి, "ప్రభూ! మీరు సెలవిచ్చినట్లు ఇంతకుముందు కరువుకాటకాలు వచ్చినవి. చెదురుమదురుగా అల్లర్లూ, తిరుగుబాట్లూ జరిగినవి. అవి విజయవంతముగా అణచివేయబడ్డవి. కాని యిప్పటికీ, ఆకాలానికీ ఒక్కతేడావుంది. ఇప్పుడు ప్రజలనుంచి 895 వసూలుచేసే పన్నులు పెరిగాయి ప్రజలు చాలామంది తమకున్న కొద్దిపాటి భూములనూ

అప్పులుచేసి తీర్చలేక వడ్డీవ్యాపారస్తులకి పోగొట్టుకున్నారు. నగరకర్మాగారాల్లో కూలీలకిచ్చే వేతనం తగ్గటంవలన దారిద్ర్యం పెరిగింది. చదువుకున్నవారికి వుద్యోగాలూ, ఆదరణాకరువై భూమిలేని నిరుపేదలు అధికమయ్యారు. ఇది కేవలం కరువుకాటకాల్లో వచ్చిన కరువుకాదు" మహామంత్రి రాజుకి విషయాన్ని విడమర్చి చెప్పవలసినవాడై, కొంతైనా చేదునిజం చెప్పకతప్పిందికాదు.

వెంటనే రాజుగారు "అయినచో కూలీలవేతనం ఏల పెంచరాదు? పేదలకు వడ్డీవ్యాపారస్తులు ఎందుచేత భూమి తిరిగి యివ్వరాదు?" అని అడిగిరి. అంతట నచ్చట యున్న వస్త్రపరిశ్రమాధిపతియూ మరియింకఅనేకవస్తు వాహనముల పరిశ్రమల కధిపతియూనైన ఒక కోటీశ్వరుండిట్లనియె,

"ఘనతవహించిన మహాప్రభూ! కూలీలవేతనములు పెంచినచో మాలాభములు తగ్గిపోవును. మా లాభములు తగ్గినచో మీకు మేము దండిగా బహుమానములిచ్చుటెట్లు? మీ కోశాగారమును, మీ విలాసఖర్చులు, సైన్యమునకగు ఖర్చులు ఏ విధముగ సరిపోవును? మరల మీరు ప్రజలపై పన్నులు అధికము చేయవలె. ప్రజలు మరల తిండిలేక తిరుగుబాటుచేయుదురు. అందుచేత వేతనములు పెంచపనిలేదు. తమరే దీనికి వేరువుపాయము నాలోచింపవలె"ననిరి.

ప్రముఖ వడ్డీవ్యాపారియూ, అనేక లక్షల బంగారునాణెముల కధిపతియునైన శ్రీమంతుడులేచి యిట్లనెను. "రాజాధిరాజా! మీరే యిట్లన్నచో మా కింకెవ్వరుదిక్కు? మేము స్వాధీనముచేసుకొన్న యిళ్ళు, భూములు, సంపదలు అన్నియుతిరిగి పేదప్రజలకిచ్చివేసినచో మేమును నిర్భాగ్యులము కావలయునుగదా! అదియే ప్రభువుల సెలవా?" యని కించిత్ నిష్ఠూరముగా పలికిరి.

అందుకు రాజు మిక్కిలి బాధపడ్డవాడై వారినుద్దేశించి యిట్లనెను. "ప్రముఖులు శాంతించవలెను. మేమిన్నినాళ్ళు కేవలం అంతఃపురగొడవలలోను, విలాసములలోను మునిగియుండుటచేత మాకు విషయములు సరిగా తెలియకపోయినవి. నేను యవివేకముతోనన్న మాటలకు మన్నింతురుగాక! నన్ను నమ్ముకున్న మీకు కీడెంచుతెలివితక్కువవాడనుగాను. మీ క్షేమము, మీ బాగు నాకు మిక్కిలి కావలసియున్నవి మీరు చెప్పవలసినది సెప్పియుండుటచేత ఇక మీరు వెళ్ళవచ్చు. మీరు నిశ్చింతగా యుండవచ్చు. మేమే ఈరాత్రికి ఏదోవొక గట్టి నిర్ణయము తీసుకొందుము"అనిరి.

ప్రముఖులు భారమంతయు రాజుపైవేసి నిశ్చింతగా వెళ్ళిరి.

896

• • •

రాత్రి చాలా ప్రొద్దుపోయింది. అంతఃపురం సద్దుమణిగింది. రాజుగారింకా మేలుకొని ఉద్యానవనంలో పాలరాతి అరుగుమీద కూర్చుని వున్నారు. రాజు మనసు చాలా ఆందోళనతోను, అనేక ఆలోచనలతోనూ యున్నది. రాజు యీ రాత్రి ఒక్క చుక్క మద్యమునైనను ముట్టలేదు. రాజనర్తకి మాలినీదేవిని కన్నెత్తిచూడలేదు. రాజుకి కళ్ళుతెరచినా మూసినా మహాజనసందోహం కనిపిస్తోంది అల్లరి, తిరుగుబాటై. తిరుగుబాటు విప్లవంగామారితే యింకేమిగతి తనకు? అని రాజు బాధపడ్డాడు. మహామంత్రిగారు మహారాజును కనిపెట్టుకుని పక్కనే కూర్చున్నారు. వారున్నూ అత్యంత విషాద సముద్రములో మునిగి అతితీవ్రముగా ఆలోచిస్తున్నారు.

రాజుగారు రాజ్యానికొచ్చి ఆట్టేఏళ్ళుకాలేదు అలా అని ఆయన కుర్రవాడుకాడు. మధ్యవయసుకూడా దాటిపోయింది. నిన్న మొన్నటి వరకు రాజు తండ్రి రాజ్యాన్ని రాజాధిరాజై ఏలి ఇటీవలనే కాలంచేసేరు తండ్రి రాజుకి ముందారాజ్యాన్ని 'అంగిశేయ'రాజ్యంవారు ఎప్పుడో దండెత్తివచ్చి లోబరచుకుని పాలించేరు. కాని రాజ్యంలో రాజవంశంవారున్నూ ధనికశ్రేష్ఠులున్నూ 'అంగిశేయ' రాజ్యంవారి మూలాన తాము అధికలాభములు, అధికసంపాదనలు రాబట్టుకోలేకపోవుచున్నామని తలచినవారై, ప్రజలను రెచ్చగొట్టి వారి కోపతాపములు తమకనుకూలముగ మార్చుకుని, 'అంగిశేయుల'కు చికాకు కలిగించసాగిరి. 'అంగిశేయులు'తామాదేశాన్ని వదలిపెట్టి వెళ్లుట తప్పదని తెలుసుకొన్నవారై రాజ్యాన్ని శక్తివంతుడయిన రాజుకి అప్పజెప్ప నిశ్చయించుకుని, అట్టి రాజుకొరకు వెదుకసాగిరి. అప్పుడొక మహాముని- ప్రజల తిరుగుబాటును అహింసాయుతముగానడిపి 'అంగిశేయుల'కు ప్రేమపాత్రుడైనవాడు- ముందుకువచ్చి, తండ్రి రాజును తీసుకొచ్చి, ఇడుగో సిసలైన రాజవంశంవ్యక్తి, రాజ్యాన్నితనికి అప్పజెప్పండి. సింహాసనమును శక్తిసామర్థ్యములతో ప్రజలనుండి రక్షించగలడనెను. 'అంగిశేయు'లందుకు సమ్మతించి రాజ్యాన్ని వదలివెళ్ళిరి.

అదీకథ. ఈ కథవయసు పాతిక సంవత్సరాలు. విచారంగా ఆలోచిస్తూ కూర్చున్నరాజుగారికీ పూర్వకథ యావత్తూ యెందులకో గుర్తువచ్చింది.

ఆయనకు వున్నట్టుండి మెరుపులా మరొకటికూడా గుర్తుకు వచ్చింది. రాజు వెంటనే మంత్రికేసి తిరిగి యిట్లనిరి "మహామంత్రీ! మా తండ్రిగారి కాలంలోనూ తిర్గుబాటు వచ్చిందికదా? కాస్తంతతక్కువ మోతాదులో. కాని తిరుగుబాటు విప్లవంగామారకుండా మా నాన్నగారు విజయవంతంగా అణిచేసేరుకదా? ఎలా అణిచేరు? ప్రజలకు మాటలుచెప్పి, విదరిపుచ్చి, జోకొట్టి, వాగ్దానాలిచ్చి, ఆశలుచూపి అణిచేసేరు, అవునా? మరందుచేత మనమిప్పుడు అటువంటిపనే మరొక్కటి చెయ్యవలెను. నా మనంబు

897

కొక్కటి తోచుచున్నది. శ్రద్ధగా ఆలకింపుడు. భూమిలేనివారికి భూమియును, తిండి లేనివారికి తిండియును, పనిలేనివారికి పనియును తప్పక యిచ్చెదమని రాజ్యమంతా రోజూ ఉదయమూ, మధ్యాహ్నమూ, సాయంకాలముకూడా దండోరావేయించవలెను. తప్పకుండా తిరుగుబాటు విప్లవముగా సమీప భవిష్యత్తులో మారకుండునని మానమ్మకం"

*　　　　*　　　　*

రాజుగారి మనుషులు దేశంయొక్క నలుమూలలకీ వెళ్ళి "భూమిలేనివారికి భూమియును, తిండిలేనివారికి తిండియును రాజుగారు కల్పించెదరహో !" అంటూ మూడుపూటలా క్రమం తప్పకుండా పెద్దపెట్టున దండోరావేసేరు.

అయితే ప్రజలు తిరుగుబాటు మానేసేరా?

చావుకి కాస్తంత దూరంగానూ, బ్రతుక్కి కాస్తంత దగ్గరగానూ వున్న ప్రజలు ఆశతో కళ్లు పెద్దవిచేసి చూసేరు. చావుకి చాలా దూరంగానూ, బతుక్కి చాలా దగ్గర గానూ వున్న ప్రజలు రాజుగారి ఔదార్యాన్ని పొగిడేరు.

కాని చావుకి అతిదగ్గరగా వున్న మనుషులూ చావంటే భయంలేని వ్యక్తులూ మొదట అనుమానంగానూ, తరువాత అపనమ్మకంతోను వుండిపోయి అడవుల్లోకెళ్ళి ఆకులలములు తింటూండేరు. వారిని రాజుగారి సైన్యాలు వేటాడేయి. తమ పాచికలు తాత్కాలికంగా పారినందుకు రాజూ, రాజవర్గం అంతానూ అత్యంతోత్సాహంతో రజ తోత్సవాలు జరుపుతుంది.

మరి రాజుగారు భూమిలేనివారికి భూమిని, తిండిలేనివారికి తిండిని యిచ్చేరా? లేదు. యిస్తామిస్తామంటూ కాలం గడిపేసేరు.

[ రా. వి. శాస్త్రి వేతనశర్మకథ చదివేక. ]

---


శాంతి కొరకు సమరం　కాంతి కొరకు సమరం
సమ సమాజం కొరకు శ్రామిక శ్రేయోరాజ్యం కొరకు

# సమరం

కవితా సమరం

మొదటిసారిగా అందరు కొత్తవాళ్ళు రాసిన
అన్ని కొత్త కవితలతో వెలువడింది. వెల: 1 రు.

ప్రతులకు: ఎ. పుల్లయ్య, 3-13-111, కుమార్‌పల్లి, హనుమకొండ
వరంగల్ 506001